వంతెన నిర్మాణం కలేనా?

- పొలాలకు వెళ్లాలంటే వాగు దాటాల్సిందే
- వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు
- వంతెన నిర్మించాలంటున్న రైతులు, ప్రజలు


ఖానాపూర్ వాగుపై తాత్కాలికంగా వేసిన రోడ్డు

కోడేరు: మండలంలోని ఖానాపూర్, పస్పుల వాగుపై వంతెన నిర్మాణం కలగా మారింది. ఎన్నో ఏళ్లుగా వాగుపై వంతెన నిర్మిస్తామని ప్రజా ప్రతినిధులు చెబుతున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. కోడేరు, పస్పులకు వెళ్లే వాగు ఖానాపూర్, సాతాపూర్ వెళ్లే గ్రామస్తులు ఈ వాగు నుంచి పంట పొలాలకు వెళ్తుంటారు. ప్రస్తుతం ఖానాపూర్ వాగుపై తాత్కాలికంగా నిర్మించిన మట్టి రోడ్డుపై రాకపోకలు సాగుతున్నాయి. మట్టి రోడ్డు స్థానంలో శాశ్వత ప్రతిపాదికన బ్రిడ్జి నిర్మిస్తే ఉపయోగంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. కోడేరు, ఖానాపూర్ గ్రామస్తులకు సంబంధించిన వ్యవసాయ భూములు దాదాపు 300 ఎకరాలకు పైగా ఖానాపూర్ వాగు అవతలివైపు ఉన్నాయి. పొలాలకు రైతులు నిత్యం వాగు దాటి వెళ్లాల్సిందే. కోడేరు, పస్పులకు వెళ్లే వాగుకు వంతెన నిర్మాణం లేకపోవడంతో భారీ వర్షాలు వస్తే రాకపోకలు నిలిచిపోతాయి. ఖానాపూర్ వాగుపై వంతెన లేకపోవడంతో రెండేళ్ల కిందట వాగు ఉధృతికి మట్టిరోడ్డు కొట్టుకుపోయి ఓ వ్యక్తి నీటిలో కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటన ఉంది. వర్షాకాలంలో నీటిలో ప్రయాణం కొనసాగించే పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. సమస్య పరిష్కారం కోసం గ్రామస్తులు, రైతులు వాగుపై తాత్కాలికంగా మట్టి రోడ్డును నిర్మించుకున్నారు. వర్షాకాలంలో మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు, రైతులు ఏకమై సొంత ఖర్చులతో ఉన్న రోడ్డును ప్రతియేటా మరమ్మతులు చేసుకుంటున్నారు. సమస్య పరిష్కరించాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

అంచనాలకే పరిమితం

ఖానాపూర్ వాగుపై వంతెన నిర్మిస్తామని ఎనిమిదేళ్ల కిందట పాలకులు హామీలు ఇచ్చారే తప్పా ఆచరణలో అమలు కావడం లేదన్నారు. నిధుల మంజూరు కోసం అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపే వరకు పరిమితం అవుతున్నారు.


వాగు నీటిలో నుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు

ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

అధికారులు దృష్టి సారించాలి



వాగుపై నుంచి ప్రతి రోజు వందలాది మంది రైతులు రాకపోకలు కొనసాగిస్తారు. గ్రామస్తులు, రైతులు పొలాలకు వెళ్లేందుకు ఈ వాగుపై నుంచి వెళ్లాల్సి ఉంది. ఈ వాగుపై గంట్రావుపల్లి, నారాయణపల్లి, సాతాపూర్ ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మిస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టలేదు. అధికారులు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి.

– పబ్బతి రంగదాసు, రైతు, కోడేరు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

ఖానాపూర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి గతంలో ఆర్అండ్‌బీ ద్వారా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు అయ్యాయి. త్వరలో పనులు చేపడుతాం. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– మోహన్, ఏఈ, కోడేరు

మానసిక లోపం ఉన్నవారిపై ప్రత్యేక దృష్టి

తెలకపల్లి: మానసిక లోపం ఉన్నవారిపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. గురువారం మండలం కేంద్రంలోని భవిత కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ప్రత్యేక అవసరాలు గల బాల బాలికలకు అందిస్తున్న విద్య సదుపాయాలను, థెరపీని అవసరమైన పరికరాలను నాణ్యమైన సేవలు అందించేందుకు సంబంధిత శాఖలు పని చేయాలని సూచించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రక్త నమూనాల సేకరణపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి పరీక్షల ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూ భారతి సదస్సులో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్, తహసీల్దార్ జాకిర్ అలీ, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్ ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యా భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

బల్మూర్: రైతుల శ్రేయస్సే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం జాతీయ ఆహార భద్రత పథకం 2025–26లో భాగంగా రైతులకు ఉచిత చిరు ధాన్యాల కిట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. రైతులు లేక పోవడంతో వ్యవసాయాధికారితో పాటు ఏఈఓలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలానికి 200 ఉచిత చిరు ధాన్యాల కిట్స్ వస్తే కనీసం 50 మంది రైతులు కూడా లేకపోతే మీరు ఏ చేస్తున్నారని ప్రశ్నించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించమని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో 10 కిట్ల చొప్పున చిరు ధాన్యాలను రైతులకు అందించి వాటి సాగుపై క్షేత్ర స్థాయిలో పని చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొజ్జ సంధ్యారెడ్డిలు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అన్నారు. నియోజకవర్గంలో 15 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో డీఏఓ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ ఓబీసీసెల్ జిల్లా చైర్మన్ గిరివర్ధన్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, ఏఎంఓ నరేష్, జిల్లా నాయకులు నర్సింగ్‌రావు, కాశన్నయాదవ్, రాంప్రసాద్‌గౌడ్, ఖదీర్, సంపంగి రమేష్,మశన్న,ఆవుల తిరుపతయ్య,మోహన్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు చిరుధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ

లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేత

లింగాల: మండల కేంద్రంలోని రైతు వేదికలలో లింగాల, అంబట్‌పల్లికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. మండలానికి మొదటి విడతలో 471 ఇండ్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజక వర్గంలో ఉన్న చెంచులకు 1000 ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. సీనియర్ నాయకులు రంగినేని శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, ఎంపీడీఓ చంద్రశేఖర్, నాయకులు వెంకటయ్య, రాజునాయక్, ఇందిరమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కల్వకుర్తి రూరల్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని మార్చాలా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారిణి జోష్ణవి ఎంపికయ్యారు. జూన్ 22న జరిగి న జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీ లలో ప్రతిభ చాటింది. ఈనెల 5, 6న హనుమకొండలో నిర్వహించే 11వరాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననుందని హెచ్‌ఎం చిరంజీవి వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయుడు యాదయ్య గౌడ్ తెలిపారు.

లట్టుపల్లిలో సమగ్ర ఆరోగ్య శిబిరం

బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి డా. టి.ప్రసన్న ఆధ్వర్యంలో 142 మందికి సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. జిల్లా దిశా మేనేజర్ రమేష్, రాజుకుమార్, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు అబ్దుల్ సలీం, పి.జ్యోతి, ఆశాలు శారద, కృష్ణవేణి, పద్మ, బాలమణి, అనిత, నాగమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఈఓ ఆకస్మిక తనిఖీ

తాడూరు: మండల పరిషత్ కార్యాలయాన్ని డిప్యూటీ సీఈఓ గోపాల్‌నాయక్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల గురించి ఎంపీడీఓ ఆంజనేయులు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ సిబ్బంది పనితీరు వివిధ అంశాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ నర్సింహులు సిబ్బంది ఉన్నారు.

బీఎల్ఓలకు శిక్షణ తరగతులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్ మాట్లాడుతూ ఓటరు లిస్టును పకడ్బందీగా తయారు చేయాలని సూచించారు. తొలగింపులు, చేర్పులపై ఖచ్చితమైన సమాచారం ఉంటేనే తొలగించాలన్నారు. శిక్షకులు శ్రీకాంత్, రఘువర్ధన్‌రెడ్డిలు బీఎల్ఓలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తహసీల్దార్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

క్రీడా సంఘాల గుర్తింపు వివరాలు ఇవ్వండి

కందనూలు: జిల్లాలోని వివిధ క్రీడాంశాలకు సంబంధించిన క్రీడా సంఘాలు తమ సంఘాల రిజిస్ట్రేషన్, ఎన్నికల సమాచారం, గుర్తింపు తదితర వివరాలు ఇవ్వాలని జిల్లా యువజన, క్రీడల అధికారి సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన క్రీడాపోటీలు, టోర్నీలకు వచ్చిన పరిశీలకుల వివరాలు, జిల్లా యువజన, క్రీడల శాఖ గుర్తింపు ఉన్న వివరాలతో ఈ నెల 21వ తేదీలోగా కలెక్టరేట్ సమర్పించాలని కోరారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు చేపట్టిన నిరాహార దీక్ష గురువారం నాటికి తొమ్మిదొవ రోజుకు చేరుకుంది. మౌన దీక్షతో నిరసన తెలిపారు. తీన్మార్ మల్లన్న టీం సభ్యులు మద్దతు ప్రకటించారు. మద్దిలేటి, కురుమయ్య, గోవిందు, స్వాములు, సీపీ నాయుడు, తరుణ్, సురేందర్, మల్లేష్, రవి, భాను ప్రకాష్, వెంకట్రాములు తదితరులు ఉన్నారు.

డైరెక్టర్ పదవికి రాజీనామా

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లి మాజీ ఉప సర్పంచు జనార్దన్ ఉమామహేశ్వర్ దేవస్థాన కమిటీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తి గత కారణాలతో డైరెక్టర్‌గా ఉండలేక పోతున్నట్లు పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని దేవస్థాన కమిటీ చైర్మన్, ఈఓకు అందజేసినట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల అందజేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని కురుమిద్ద గ్రామా నికి చెందిన బాల చెన్నయ్యకు రూ.23 వేలు, ఐలెన్ కు రూ.25 వేలు, ఆర్ ఆంజనేయులుకు రూ.25 వేలు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరయ్యాయి. గురువారం మాజీ ఉప సర్పంచ్ విజయభాస్కర్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. బిసా బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు సంబురం

పెద్దకొత్తపల్లి:మండల కేంద్రంలోని వాసవి కన్యాకరపరమేశ్వర ఆలయంలో ఆషాడంమాసం సందర్భంగా గురువారం గోరింటాకు సంబురాలు నిర్వహించారు. అంతకుముందు అమ్మవారిని కూరగాయలతో అలంకరించి ఓరయి మాతగా పూజించారు. అరుణ, హేమలత, రజిత, గీతారాణి, సంధ్యా, పుష్పలత, సాయిలీల, జ్యోతి, పద్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రికి ప్రత్యేకంగా సబ్‌స్టేషన్ నుంచి ఫీడర్‌ను ఏర్పాటు చేస్తున్న కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ ఏడీఈఈ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శనగర్, ఎస్‌బీఐ బ్యాంకు, వినాయకనగర్ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎంపీడీఓకు సమ్మె నోటీస్



ఉప్పునుంతల: తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ మోహన్‌లాల్‌కు ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల బాధ్యులు చింతల నాగరాజు, నాయకులు సైదులు, రవి, గ్రామ పంచాయతీ కార్మికులు రమేష్, రామచంద్రయ్య, బాల్‌లక్ష్మమ్మ, నవనీత, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యావలంటీర్ ఏర్పాటుకు సహకారం



కందనూలు: కొల్లాపూర్ మోడల్ స్కూల్‌లో విద్యావలంటీర్‌ను గురువారం క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు క్లాస్‌మెట్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కేపీ ప్రసాద్ తెలిపారు. క్లాస్‌మెట్ ప్రతినిధి ఎలిసెట్టి వేణుగోపాల్ విద్యావలంటీర్‌కు ప్రతి నెల రూ.3 వేలతో పది నెలల వరకు చెల్లించనున్నారు. మొదటి నెల డబ్బులను డీఈఓ రమేష్‌కుమార్ చేతుల మీదుగా పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసశర్మకు అందించారు. కార్యక్రమంలో క్లాస్‌మెట్ క్లబ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు



తిమ్మాజిపేట: ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాల డీలర్లు నిబంధనలు ఉల్లంఘించొద్దని నాగర్‌కర్నూల్ వ్యవసాయ సహాయ సంచాలకులు పూర్ణచంద్రారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలలో స్టాక్ ఉన్న ఎరువులను ఏఓ కమల్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. దుకాణం యజమానులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సిబ్బంది, తదితరులు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వెల్దండ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జీహెచ్‌ఎం సుగుణ అన్నారు. గురువారం మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలల్లో పాఠశాలల్లో చేరిన నూతన విద్యార్థులకు వెల్‌కమ్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో పిల్లలను చేర్పించి తల్లిదండ్రులు డబ్బులు వృథా చేసుకోవద్దన్నారు. 10వ తరగతిలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సైన్స్ ప్రయోగంలో విద్యార్థులు చేసిన సోలార్ పవర్ వాటర్ ఫిల్టర్ ప్రాజెక్టు తయారు చేయడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్‌రెడ్డి, మురళీమోహన్‌రావు, విజయ, లావణ్య, రామేశ్వరమ్మ, లక్ష్మీ సుహాసిని, అనిత, సిబ్బంది మహేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

యూరియా కోసం రైతుల అవస్థలు


పీఏసీఎస్ కార్యాలయం ఎదుట యూరియా కోసం వేచి ఉన్న రైతులు

లింగాల: వానాకాలం పంటలకు అవసరమైన యూరియా కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో నిల్వ ఉన్న యూరియాను కొనుగోలు చేయుటకు గురువారం రైతులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సీఈఓ పాండు మాట్లాడారు. ప్రస్తుతం పీఏసీఎస్‌లో 1500 బస్తాల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. ఒక్కో రైతుకు 10 బస్తాల వరకు యూరియాను అందజేస్తున్నట్లు, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని కోరారు.

అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలి


అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నియోజకవర్గంలోని పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన పనులు, ఇంకా ప్రారంభం కావలసిన పనులు, పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సమావేశానికి ఈఈలు విజయ్, సుదర్శన్ రెడ్డి, డీఈ లు బసవలింగం, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సత్యానారాయణ ఏఈలు పరమేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో వసతులు కల్పించాలి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో వసతులు కల్పించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మశాన వాటిక నిర్మించి మూడు సంవత్సరాలు దాటినప్పటికి రాత్రి వేళలో దహన సంస్కారాలు చేసే వారికి వెలుతురు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మినీ ట్యాంకుబండ్‌ను శుద్ధి చేసి వెంటనే వాడుకలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ మురళికి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కల్వకుర్తి: పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం 12వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి,పుస్తకాల రాహుల్, కుడుముల చంద్రకాంత్ రెడ్డి, ఆంజనేయులు, జమ్ముల శ్రీకాంత్, పాండురంగారెడ్డి,నాని యాదవ్,శివప్రసాద్, సురేష్,శ్రావణ్ వా ర్డు ఆఫీసర్ శివప్రసాద్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

తుర్కలపల్లిలో..

చారకొండ: మండలంలోని తుర్కలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు డీసీసీ కార్యదర్శి మహేందర్ భూమి పూజ చేశారు.నాయకులు నర్సింహారెడ్డి, సహదేవ్, కృష్ణయ్య, శేఖర్, సత్తయ్య, అధికారులు ఉన్నారు.

విద్యార్థినులను వేధిస్తే చర్యలు



బల్మూర్: మహిళలను వేధిస్తే చర్యలు తప్పవని అచ్చంపేట షీ టీం ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ పద్మ హెచ్చరించారు. మండలంలోని గోదల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం షీ టీంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మాదకద్రవ్యాలు, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. పలు చట్టాల గురించి వివరించారు. ఎవరైన ఆకతాయిలు వేధిస్తే 1930, డయల్ 100 ఫోన్ చేయాలని కోరారు. హెచ్‌ఎం రాంసింగ్, షీ టీం కానిస్టేబుల్ వెంకట్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌ల అందజేత



వెల్దండ: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థులకు ఐక్యత ఫౌండేషన్ సహకారంతో 8 ల్యాప్‌టాప్‌లను తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ రాఘవేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో డిజిటల్ కంప్యూటర్ విద్యతో పోటీపడుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణరత్నం, మురళీ, ఉపాధ్యాయుల బృందం, ఫౌండేషన్ సభ్యులు దశరథ్‌నాయక్, లాలునాయక్, నర్సింగ్, రమేష్‌నాయక్, కొండల్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

లింగాల: పాఠశాలల తరగతి గదులను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో గురువారం ప్రధానోపాధ్యాయులకు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ త్వరలో మండలంలో పర్యటించనున్న స్వచ్ఛ పర్యవేక్షణ బృందం సందర్శనపై హెచ్‌ఎంలకు అవగాహన కల్పించారు. పరిశుభ్రత నిర్వహణ, యూడై స్ తదితర అంశాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

అండర్ డ్రెయినేజీని నిర్మించాలి

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఒకటో వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాబీ దేవ్ డిమాండ్ చేశారు. గురువారం వార్డులో వారు పర్యటించి కాలనీవాసులతో మాట్లా డి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ ఏఈ షబ్బీర్‌కు సమస్యలపై వినతిపత్రం అందించారు. రాంభూపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కృష్ణ గౌడ్, గంగాధర్, శివ కాలనీవాసులు పాల్గొన్నారు.

రేపు సాగునీటిపై అవగాహన సదస్సు

చారకొండ: ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగునీటి రంగంలో జరుగుతున్న అన్యాయంపై ఈనెల 5న హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహిస్తునట్లు పాలమూరు అధ్యయన వేదిక కల్వకుర్తి డివిజన్ కన్వీనర్ చింతపల్లి అశోక్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. రైతులు, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు శ్రీనివాసులు, సత్యానారాయణ రెడ్డి, వీరేష్, రామస్వామి ఉన్నారు.

బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాకేంద్రం సమీపంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఉయ్యాలవాడలో బూత్ స్థాయి అధికారులకు శిక్షణ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. శిక్షణ శిబిరంలో మాస్టర్ ట్రైనర్స్ ద్వారా ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. అలాగే శిక్షణ కార్యక్రమాన్ని ఆర్డీఓ సురేష్, నాగర్‌కర్నూల్, తిమ్మాజిపేట తహసీల్దార్లు తబితా రాణి, రామకృష్ణ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రాములు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. కాగా.. శుక్రవారం బిజినేపల్లి, నాగర్‌కర్నూల్ మండలాల బూత్ స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

తాడూరు: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక బృందం పర్యటించి సర్వే చేస్తారన్నారు. గ్రామాలలో పైపులైన్ల లీకేజీలు, డంపింగ్ యార్డుల నిర్వహణ, వివిధ అంశాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంపీఓ నర్సింహులు ఏపీఓ చంద్రసిద్ధార్థ, ఏఈ శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను పరిశీలించిన బీఆర్ఎస్ బృందం



తిమ్మాజిపేట: మండలంలోని పలు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్లను గురువారం బీఆర్ఎస్ బృందం పరిశీలించింది. గోరిట–బాజీపూర్ మధ్యన ఉన్న బీటీ రోడ్డును పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5.4 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. అదేవిధంగా ఎదిరేపల్లి–ఎదిరేపల్లి తండా మార్గంలో గిరిజనులకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరైన ప్రస్తుత పాలకుల, అధికారుల నిర్లక్ష్యం కారణంగా బీటీ రోడ్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయని దీంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచులు గోపిగౌడ్, మురళీధర్‌రెడ్డి, నాయకులు స్వామి, వెంకటేష్, రాఘవచారి, బాల్‌రెడ్డి, సైఫ్, బాలయ్య, మాసయ్య, రాజెందర్‌రెడ్డి పాల్గొన్నారు.